క్లుప్తంగా

పందుల తరలింపు



వల వేసి పందులను పట్టుకుంటున్న వ్యక్తి

ప్రొద్దుటూరు : పట్టణంలో పందుల వల్ల ప్రజలకు కలిగే అసౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని పందులను వాటి యజమానులు స్వతహాగా వాటిని దూరంగా తరలించారు. ప్రజల ఫిర్యాదు మేరకు గత నెల జూన్ 26న పందుల యజమానులతో మున్సిపల్ కమిషనర్ సమావేశం నిర్వహించి పందులను పట్టణానికి దూరంగా తరలించాలని ఆదేశించారు. ఆమేరకు శుక్రవారం మోడంపల్లెలోని ఐడియల్ స్కూల్, కొవ్వూరు గ్యారేజ్ వద్ద దాదాపు 11 పందులను వాటి యజమాని రమణయ్య పట్టుకుని తరలించారు. అలాగే వైఎంఆర్ కాలనీలో 25 పందులను వాటి యజమాని శ్రీరాములు, రామేశ్వరంలోని మరో పందుల యజమాని 25 పందులను పట్టుకుని పట్టణానికి దూరంగా తరలించారు.

సన్మానం



డాక్టర్ వరుణ్‌కుమార్ రెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : డాక్టర్ ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యుడుగా నియమితులైన డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డిని శుక్రవారం బీజేపీ నాయకుడు చలపతిరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చలపతి రావు మాట్లాడుతూ డాక్టర్ వరుణ్ కుమార్‌రెడ్డి కరోనా సమయంలో రోగులకు ఎన్నో సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం మాజీ పట్టణాధ్యక్షుడు చంద్రబాబు, ఖాదర్‌వలి, సామెల్, జయరామ్ పాల్గొన్నారు.

డ్రైనేజీ కాలువ పూడికపై స్పందించిన ఈఓ



పూడిపోయిన కాలువను పరిశీలిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రసాదరెడ్డి

పోరుమామిళ్ల : రంగసముద్రం పంచాయతీ పరిధిలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద మురుగు నీటి కాలువ పూర్తిగా పూడిపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నామని ఆ ఏరియా ప్రజలు పంచాయతీ ఈఓ ప్రసాదరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ప్రసాదరెడ్డి శుక్రవారం కాలువ పూడిన ఏరియాను పరిశీలించారు. వెంటనే పూడిక తీయించి సమస్య లేకుండా చేస్తామని ప్రజలకు వివరించారు.

బి. మఠంలో పాత సత్రాలు తొలగింపు



పాత సత్రాలను తొలగించిన దృశ్యం

బ్రహ్మంగారిమఠం : బి. మఠంలో అభివృద్ధిలో భాగంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ఆధీనం ఉన్న పాత సత్రాలను శుక్రవారం తొలగించారు. మఠం పిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ ఆధ్వర్యంలో సత్రాలను కూల్చారు. తొలగించిన సత్రాల స్థానంలో త్వరగతిన వ్యాపార సముదాయాలు నిర్మించాలని వ్యాపారులు కోరుతున్నారు. మఠంలోని నాలుగు రోడ్లు కూడలిలో దేవస్థానానికి చెందిన మరి కొన్ని వ్యాపార సముదాయాలు అడ్డుగా ఉన్నాయని, వాటిని కూడా త్వరలో తొలగిస్తామని పిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మైదుకూరు : మైదుకూరు పట్టణంలోని సబ్‌స్టేషన్ల పరిధిలోని 11 కేవీ ఫీడర్స్‌లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రామభద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ల పరిధిలో చెట్లను తొలగించడం, ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. అందువల్ల ఉదయం 7.40 గంటల నుంచి 10.50 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వివరించారు. అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

చాపాడు : మండలంలోని చాపాడు, కేతవరం, బద్రిపల్లె, అల్లాడుపల్లె గ్రామాలలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు ట్రాన్స్ కో జూనియర్ ఇంజినీర్ నరేంద్రరెడ్డి తెలిపారు. 11కేవీ విద్యుత్ తీగలపై చెట్లను తొలగిస్తున్నామని పేర్కొన్నారు. ఉదయం 8.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

వైభవంగా పీర్ల ఊరేగింపు



గోపాయపల్లెలో ప్రత్యేక అలంకరణలో పీర్లు

రాజుపాళెం : మొహర్రం వేడుకల్లో భాగంగా మండలంలోని గోపాయపల్లె గ్రామంలో శుక్రవారం రాత్రి వైభవంగా పెద్దఖాశీం, చిన్నఖాశీం, చందమామ స్వాముల పీర్లను అంగరంగ వైభవంగా ఊరేగించారు. సాయంత్రం నుంచి పీర్లను ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేసి చదివింపులు చేశాక నైవేద్యాన్ని పంచిపెట్టారు. అనంతరం తప్పెట్లు, మేళ తాళాల మధ్య భక్తులంతా ఊరేగించారు.

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం వేడుకలు

కలసపాడు : మండలంలోని ఎగువరామాపురంలో పీర్ల చావిడిని శుక్రవారం సీఐ డి.శ్రీనివాసులు సందర్శించి మాట్లాడారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని సీఐ సూచించారు. గ్రామంలో ప్రతి గుడి వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎగువరామాపురం కమిటీ ఆధ్వర్యంలో కందూరు గ్రామస్తులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈనెల 7న చిన్న సర్గేస్, 8న పగలు సర్గేస్, 9న పెద్ద సర్గేస్, 10న పీర్లు నీళ్లలోకి వెళతాయని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తిమోతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి సన్మానం



సచివాలయ సిబ్బంది సన్మానిస్తున్న నాయకులు

చాపాడు : మండలంలోని ఖాదర్‌పల్లె గ్రామ సచివాలయంలోని సిబ్బందిని శుక్రవారం స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. సచివాలయంలో ఐదేళ్లు విధులు పూర్తి చేసుకున్న సిబ్బంది సాధారణ బదిలీల్లో భాగంగా ఇతర ప్రాంతాలకు వెళ్తున్న క్రమంలో పంచాయతీ కార్యదర్శి, సర్వేయర్, మహిళా పోలీసు, డిజిటల్ అసిస్టెంటు, వీఏఏ, ఏఎన్ఎంలను మైదుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది స్థానిక ప్రజలకు అందుబాటులో ఉంటూ అన్ని విధాల సహాయ సహకారాలు అందించారన్నారు. ఇప్పటి వరకూ విధుల్లో బాధ్యతగా వ్యవహరించాలని, ఇకపై వారు పని చేసే చోట ఇదే క్రమంలో విధులు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు జైనుల్లా, లక్ష్మీనారాయణరెడ్డి, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి చెత్త సేకరణపై డీపీఓ అసంతృప్తి



చెత్తతో నిండిన కాలువను పరిశీలిస్తున్న డీపీఓ రాజ్యలక్ష్మి

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని కొత్తపల్లె సచివాలయం -4 పరిధిలో ఇంటింటి కసువు సేకరణ సక్రమంగా లేదని డీపీఓ రాజ్యలక్ష్మి అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం కొత్తపల్లె సచివాలయం -4 పరిధిలోని అమృతానగర్‌ను డీపీఓ పరిశీలించారు. కాలువలో పూడికతీత, రోడ్ల వెంబడి అపరిశుభ్రత ఉన్న విషయాన్ని ఆమె పరిశీలించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐవీఆర్ఎస్‌లో కొత్తపల్లె సచివాలయం -4 తక్కువగా ర్యాంక్ వచ్చిందని తెలిపారు. 10 వేల అడుగులకంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ భవనాలపై రీఅసెస్మెంట్ చేసి వాటి కొలతలు సక్రమంగా ఉన్నాయా లేదా చూడాలని, కొలతల ప్రకారం పన్నులు వసూలు చేస్తున్నారా లేదా అనే విషయంపై డీడీఓలు దృష్టి సారించాలన్నారు. మండల వ్యాప్తంగా 82 ప్రభుత్వ, ప్రైవేట్ భవనాలను రీ అసెస్మెంట్ చేయాలని ప్రభుత్వం నుండి ఆదేశాలు వచ్చాయన్నారు. డీడీఓలు క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యలపై దృష్టి సారించాలన్నారు. సిబ్బంది ప్రతి రోజు చెత్త సేకరణ తప్పకుండా చేయాలన్నారు. అనంతరం కొత్తపల్లె గ్రామ పంచాయతీలో చెత్త సేకరణ సిబ్బంది, బిల్ కలెక్టర్లతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ రామాంజనేయరెడ్డి, ఇన్‌చార్జి డీఎల్‌పీఓ రమణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలి



గ్యారేజీ గేటు ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న ఎంప్లాయీస్ నాయకులు

బద్వేలు అర్బన్ : ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో గ్యారేజీ గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంప్లాయీస్ యూనియన్ రీజనల్ అధ్యక్షుడు బోసుబాబు మాట్లాడుతూ దాదాపు 6 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను వెంటనే చేపట్టి కొత్త ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరారు. ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో దాదాపు 2500 బస్సులు, 10 వేల మంది సిబ్బంది అవసరమవుతారని, ఈ మేరకు కొత్త బస్సులు, కొత్త ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరారు. ముఖ్యంగా సర్క్యులర్ 1/2019ని అమలు చేయడంతో పాటు పాత పద్ధతిలో వైద్యసేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు కొండయ్య, అడిషనల్ సెక్రటరీ పెంచలయ్య, జాయింట్ సెక్రటరీ వై.జె.రెడ్డి, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

9, 10 తేదీల్లో గురుపౌర్ణమి వేడుకలు

గోపవరం : మండలంలోని బుచ్చనపల్లె గ్రామంలో వెలసి ఉన్న శ్రీషిరిడిసాయినాథ్‌మహరాజ్ స్వామివారి ఆలయంలో ఈ నెల 9, 10వ తేదీల్లో గురుపౌర్ణమి పర్వదిన మహోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు కూకట్లపల్లి వెంకమ్మ, నారాయణ తెలిపారు. 9వ తేదీ బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు ఉదయం 8 గంటలకు పూజా కార్యక్రమాలతో ప్రారంభమవుతాయన్నారు. 10వ తేదీ గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రత్యేక కార్యక్రమాలతో పాటు ఉమ్మడి కడపజిల్లా స్థాయిలో చెక్కభజన (కులుకుభజన) పోటీలు ఉంటాయని, పోటీల్లో పాల్గొని గెలుపొందిన భజన బృందాలకు మొదటి బహుమతి రూ.50 వేలు, రెండవ బహుమతి రూ.30 వేలు, మూడవ బహుమతి రూ.20 వేలు అందజేయడం జరుగుతుందన్నారు. భజన బృందాలు పోటీలో పాల్గొనేందుకు 9966050467 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ గురుపౌర్ణమి మహోత్సవ వేడుకల్లో స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవాలని ధర్మకర్తలు కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో చెన్నయ్య

పోరుమామిళ్ల : దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కుర్రా చెన్నయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన మండలంలో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ రిలీజ్ చేయాలని, 3 డీఎలను, సీపీఎస్ ఉద్యోగుల అరియర్స్‌ను విడుదల చేయాలని, 12వ పీఆర్సీని అమలు చేయాలని, ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యుటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు, ఈశ్వరరావు, జిల్లా కౌన్సిల్ మెంబర్స్ క్రిష్ణయ్య, ఖాజా నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించిన ఎస్పీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలో రక్తదాన కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా చేపట్టిన 'రక్తదాన వారోత్సవాలు' పోస్టర్లను శుక్రవారం జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆవిష్కరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ ఈ రక్తదాన కార్యక్రమాలు జూలై 20 నుండి 26 వరకు జరుగుతాయన్నారు. ఈ రక్త వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న జేబీవీఎస్, విక్షిత ఫౌండేషన్, చేతన ఫౌండేషన్, శ్రీ జ్యోతిబాయ్ పూలే సేవా సమితి, అమృత హస్తం సేవాసమితి, సిఆర్‌వి సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్, కేర్ క్లబ్ ఫౌండేషన్, వింగ్స్ ఆఫ్ హ్యుమానిటీ సంస్థలను అభినందించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు పాల్గొన్నారు.

రేపు ఉచిత రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు

ప్రొద్దుటూరు : మండలంలోని ప్రభుత్వ పశు వైద్య కళాశాలలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఈనెల 6న ఆదివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పెంపుడు జంతవులకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేస్తామని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కుక్క పిల్లలు, పిల్లులకు ఉచితంగా టీకాలు వేస్తామని, పెంపుడు జంతువుల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సీపీఎం ధర్నా

పోరుమామిళ్ల : స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి భైరవప్రసాద్ మాట్లాడుతూ కేంద్రంలో రెండవసారి గద్దెనెక్కిన మోడీ ఇంతవరకు కోటి ఉద్యోగాల ఊసే ఎత్తడం లేదన్నారు. ఇంటికి రూ. 15 లక్షలు ఇస్తానని మరచిపోయారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కరెంటు, బస్సుచార్జీలు పెంచి ప్రజలపై బారం మోపిందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు తగ్గించి పేద మధ్య తరగతి ప్రజలను ఆదుకోవాలన్నారు. ధర్నా అనంతరం తహసీల్దారు గంగయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

30 పోలీస్ యాక్ట్ అమలు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు సబ్ డివిజన్ పరిధిలో జూలై 1 నుంచి 31వ తేదీ వరకు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని డీఎస్పీ పి.భావన శుక్రవారం తెలిపారు. డివిజన్ పరిధిలో ఊరేగింపులు, ధర్నాలు, సభలు నిర్వహించుటకు తప్పనిసరిగా నిర్వాహకులు ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని డీఎస్పీ సూచించారు. పోలీస్ యాక్ట్‌ను అతిక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు మండల సమావేశం

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో శనివారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వ సభ్య సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ అధ్యక్షత జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశానికి మండల శాఖ అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరు కావాలని, ప్రజాప్రతినిధులందరూ సమావేశంలో తప్పక పాల్గొనాలని కోరారు.

విద్యార్థులకు అతిథి భోజనం



పాఠశాల విద్యార్థులకు కాపీరైటింగ్ పుస్తకాలను అందిస్తున్న ఉపాధ్యాయులు

కాశినాయన : మండలంలోని మూలపల్లె ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న ఎర్రబల్లి ఓబులేసు పుట్టిన రోజు సందర్భంగా వారి తండ్రి ఓబయ్య పాఠశాలలోని 30 మంది విద్యార్థులకు మాంసాహార విందు ఏర్పాటు చేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ తెలిపారు. అలాగే పాఠశాల పూర్వపు విద్యార్థి గొంటువారిపల్లెకు చెందిన గురుప్రసాద్ (హార్టికల్చరల్‌ఉద్యోగి) పాఠశాలలోని విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీషు, హిందీ కాపీ రైటింగ్ పుస్తకాలను అందజేశారు. వీరికి ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, విద్యార్థులు, పాఠశాల కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

కడప రూరల్ : కడప నగరంలోని జగదీష్ న్యూరో కేర్‌లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆస్పత్రి ఎండీ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడారు. వైద్య శిబిరంలో సీనియర్ జనరల్ ఫిజిషియన్ డాక్టర్ క్రాంతిరెడ్డి అన్ని రకాల వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు, సలహాలు ఇస్తారన్నారు. అలాగే శిబిరంలో షుగర్ పరీక్ష ఉచితంగా చేస్తారని తెలిపారు.

అవినీతి అధికారి ఓడీ రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న ఎంప్లాయిస్ యూనిటీ అసోసియేషన్ ఉద్యోగులు

మైదుకూరు : పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, డీఎం కార్యాలయంలోని అవినీతి అధికారి ఓడీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మైదుకూరు ఆర్టీసీ డిపోలో ఎంప్లాయిస్ యూనిటీ అసోసియేషన్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలను ధరించి విధులకు హాజరయ్యారు. ధర్నా సందర్భంగా అసోసియేషన్ రీజినల్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున తదితరులు మాట్లాడుతూ ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణ ప్రైవేటు ఆపరేటర్లకు లీజుకు ఇవ్వకుండా ఆర్టీసీ సొంతంగా ప్రభుత్వ ఉద్యోగులతో నడపాలని కోరారు. పెండింగ్ డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఐఆర్ ప్రకటించాలని అన్నారు. పాత పద్ధతిలోనే వైద్య సౌకర్యాలను కల్పించాలని కోరారు. టైమ్స్ డ్యామేజీపై రికవరీని ఆపాలని తెలిపారు. మైదుకూరు డిపో మేనేజర్ కార్యాలయంలో అవినీతికి పాల్పడుతున్న టీవీ ప్రసాద్ ఓడిని రద్దు చేయాలని, బ్రహ్మంగారిమఠం సర్వీసును సరైన రన్నింగ్ టైంలో నడపాలని కోరారు. ధర్నాలో అసోసియేషన్ డిపో అధ్యక్షుడు ఎం.నారాయణ, కార్యదర్శి టీపీ మునెయ్య, కోశాధికారి కె.నరసింహులు, గ్యారేజీ కార్యదర్శి పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి మార్గాలను తెలుసుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణ రెడ్డి

మైదుకూరు : సమస్యల పరిష్కారానికి యువత మార్గాలను తెలుసుకోవాలని మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి, యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ (వైఎఫ్ఎస్ఐ) కళాశాల కోఆర్డినేటర్ డాక్టర్ సి.నరసింహారావు అన్నారు. డైరెక్టర్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ ఆదేశంతో శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్‌పై అవాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ కార్యక్రమం విద్యార్థులకు సమాజ సమస్యలపై అవగాహన కల్పించి, వాటి పరిష్కారానికి ఉపయుక్తమైన మార్గాలను సూచించే విధంగా రూపొందించబడిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా యువత తమ వ్యక్తిగత సామర్థ్యాలను గుర్తించడంతోపాటు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని జీవితంలో స్థిరత సాధించగలుగుతారని తెలిపారు. ఇతరులకు ఉపాధి కల్పించే సామర్థ్యాన్ని కూడా సాధించవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు ఉద్యోగుల కోసం ఎదురు చూడకుండా, స్వయం సమర్థులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అధ్యాపకుడు చెన్న రాయుడు పీపీటీ ప్రజెంటేషన్ ద్వారా కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహనను కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వైస్ ప్రిన్సిపాల్ సుభాన్ సాహెబ్, అధ్యాపకులు అయ్యవారు రెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, నవనీశ్వర్‌రెడ్డి, డాక్టర్ పీవీ కృష్ణారెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి



దోమల నివారణపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

గోపవరం : ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని ప్రతి కుటుంబం పాటిస్తే దోమలను అదుపు చేయవచ్చని బద్వేలు సబ్ యూనిట్ ఆఫీసర్ టి.నరసింహారెడ్డి, వైద్యాధికారి బి.మురళీకృష్ణ తెలిపారు. ఈ నెల 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు డెంగీ మాసోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. అందులో భాగంగా శుక్రవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్య సిబ్బంది, విద్యార్థులచే జాతీయ కీటక జనిత వ్యాధులపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమలు అభివృద్ధి అయ్యే ప్రాంతాల గురించి ప్రజలకు అవగాహన కల్పించి నివారణ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. దోమకాటు వలన మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, మెదడువాపు వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, ఇవి రాకుండా నివారించాలంటే ప్రజలందరి భాగస్వామ్యంతో దోమలను అదుపు చేయాల్సిన అవసరం ఉందన్నారు. దోమకాటుకు గురికాకుండా దోమతెరలు వాడాలని, ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రత పాటించడంతో పాటు ఎటువంటి జ్వరాలు వచ్చినా వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్ళి రక్తపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అవసరమైన మందులు ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ గౌస్, వైద్య సిబ్బంది బాష, రాజు, గణేష్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



వివిధ పదవులు పొందిన నాయకులతో ఎమ్మెల్సీ

పోరుమామిళ్ల : వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని అదే సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తెలిపారు. శుక్రవారం పార్టీలో అనుబంధ విభాగాలకు పదవులు పొందిన నాయకులు పోరుమామిళ్ల పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిని కలిశారు. బూతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈగ యద్దారెడ్డి, బద్వేలు మునిసిపాలిటీ అధ్యక్షుడు సుందరరామిరెడ్డి ఆధ్వర్యంలో వారంతా పదవులు రావడానికి కారణమయిన ఎమ్మెల్సీని సన్మానించారు. వైఎస్ జగన్ పాలనలో ప్రజలకు జరిగిన ప్రయోజనాలు, అందిన సంక్షేమ పథకాలు ప్రచారం చేయాలని ఎమ్మెల్సీ సూచించారు. నూతనంగా పదవులు లభించిన వారిలో మునిసిపాలిటీ విభాగం ఎగ్జిక్యూటివ్ మెంబర్ లక్ష్మిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రతాప్, కార్యదర్శి పోలిరెడ్డి, సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శి ప్రసాద్, బూతు కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఓబులేసు, విద్యార్థి విభాగం ఎగ్జిక్యూటివ్ మెంబర్ రవీంద్రారెడ్డి, సెక్రటరీ రాజేష్‌యాదవ్‌లు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు నాగేశ్వరరావు, రామచంద్రయాదవ్, అంకన గురివిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుదర్శన్, రాళ్లపల్లె నరసింహులు, సాయినారాయణరెడ్డి, వెంకట సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పటిష్టమైనది భారతి సిమెంట్



జాగ్రత్తలను మేస్త్రీలకు వివరిస్తున్న భారతి సిమెంట్ కంపెనీ టెక్నికల్ ఇంజనీర్ నాగేంద్ర

ప్రొద్దుటూరు : అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలకు భారతి సిమెంట్ పటిష్టమైనదని భారతి సిమెంట్ కంపెనీ టెక్నికల్ ఇంజనీర్ నాగేంద్ర తెలిపారు. ప్రొద్దుటూరులో శుక్రవారం మేస్త్రీలకు భారతి సిమెంట్ నాణ్యత, వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతి సిమెంట్ రోబోటిక్ టెక్నాలజీతో, జర్మన్ టెక్నాలజీతో, ట్యాంపర్ ప్రూఫ్ ప్యాకింగ్‌తో తయారవుతోందని, అల్ట్రా ఫాస్ట్ నాణ్యత కలిగి ఉంటుందన్నారు. ఇతర కంపెనీల సిమెంట్ ఐదు గంటల్లో సెట్ అయితే.. భారతి అల్ట్రా ఫాస్ట్ రెండు గంటల్లోనే సెట్ అవుతుందని తెలిపారు. చాలా దృఢత్వాన్ని కలిగి, కట్టడాలు త్వరగా పూర్తికాగలవని చెప్పారు. అనంతరం తాపీ మేస్త్రీలకు రక్షణ కోసం టోపీలు, చేతి తొడుగులు, మేసన్ కిట్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాణ యజమాని డాక్టర్ వెంకటేష్, మేస్త్రీలు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని ధర్నా



ఆర్టీసీ డిపో వద్ద ఈయూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న ఉద్యోగులు

ప్రొద్దుటూరు : స్థానిక ఆర్టీసీ డిపో వద్ద శుక్రవారం సమస్యలను పరిష్కరించాలని ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లను ఇవ్వాలని, డీఏ బకాయిలను, 24 నెలల పే స్కేల్ అరియర్స్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ ఉద్యోగులచే నిర్వహించాలని, డబల్ డ్యూటీ అమౌంట్ పెంచాలని, ఐఆర్ ప్రకటించాలని తెలిపారు. 2019 సర్క్యులర్ అమలు చేయాలని, ఈహెచ్ఎస్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. టిమ్స్ డ్యామేజ్ రికవరీని నిలిపివేయాలని, బ్రేక్ డౌన్ బస్సులకు గ్యారేజీ సిబ్బందిని బాధ్యులను చేయడం నిలుపుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బీవీపీ రెడ్డి, ఆర్ఎస్ రెడ్డి, పీఎన్‌పీ రెడ్డి, బీసీ శేఖర్, బీవీ రమణ, వీఆర్ఎస్ రెడ్డి, పి.వెంకటేశ్వర్లు, జి.గంగాధర్ రెడ్డి, ఎస్ఎన్‌కే రెడ్డి, ఎన్‌వీ సుబ్బయ్య, అనీస్, ఆర్‌డీ బాబు, వంశీ, మాధవ్, శాంతకుమారి, శారదా, సులోచన తదితరులు పాల్గొన్నారు.